ప్రజాశక్తి

సోమవారం 27 ఫిబ్రవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

మరమ్మతులకు నీళ్లు

- ఎవరికీ పట్టని కాల్వల్లో వ్యర్థాల తొలగింపు
- తరచూ ముంపుబారిన పడుతున్న పైర్లు
- గతేడాది తీవ్ర ఇబ్బందులు
- ఈ ఏడాదీ రైతులకు క(న)ష్టాలేనా



తెనాలి ప్రాంతంలోని ఓ పంట కాల్వలో పేరుకుపోయిన గడ్డి (ఫైల్)

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కృష్ణా డెల్టా పరిధిలో వివిధ ప్రాంతాల్లో కాల్వలు మరమ్మతులు నోచక గత ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పైర్లు వేసిన తరువాత మరమ్మతులకు అధికారులు గతేడాది ప్రణాళికలు రూపొందించారనే విమర్శలు రాగా ఈ ఏడాదింకా ప్రణాళిక రూపొందించలేదు. జిల్లా నీటి పారుదల అభివృద్ధి మండలి సమావేశాలు జరగడం లేదు. వ్యవసాయ సలహా మండలి సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. ప్రజా ప్రతినిధులెవ్వరూ భాగస్వామ్యం కావడం లేదు. రాబోయే ఖరీఫ్‌కు ముందుగా ఈ వేసవిలో కాల్వల మరమ్మతులకు ప్రతిపాదనలేమీ అధికారులు సిద్ధం చేయలేదు.

కాల్వలకు సకాలంలో మరమ్మతులు చేయక గత జులై, ఆగస్టు అధిక వర్షాలు వచ్చినా చివరి భూములకు నీరు అందలేదు. ఈ అంశంపై రైతులు ఆందోళన నిర్వహించిన తరువాత అధికారులు మేల్కొన్నారు. 2022-23లో చేపట్టిన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు గతేడాది ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో కృష్ణా డెల్టా పరిధిలో ఐదు లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తారు. కాల్వల్లో కనీసం తూడాకు, గుర్రపు డెక్క తొలగింపు, కాల్వలను శుభ్రపరిచేందుకు 2022-23లో చేపట్టిన పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. కొన్నిచోట్ల మమ అనిపించారు. నిధుల సమస్యలతో కాంట్రాక్టర్లు ముందుకు రాక పనులు చేయడంలో తీవ్ర జాప్యమైంది. కాల్వల మరమ్మతులు లేక అక్టోబరు, నవంబరులో అధిక వర్షాలు, తుపాన్లతో పంటలకు ముంపు సమస్య ఏర్పడింది. మొత్తంగా కాల్వల నిర్వహణ సరిగా లేక రైతులకు గోడదెబ్బ...చెంప దెబ్బ మాదిరిగా రెండు విధాలుగా నష్టపోతున్నారు.

మంగళగిరి నియోజకవర్గం పరిధిలో రూ.90 లక్షలతో కాల్వల మరమ్మతులకు ఆమోదం తెలపగా 7 పనులు చేపట్టారు. పొన్నూరు నియోజకవర్గం పరిధిలో 17 పనులకు గాను 14 చేపట్టారు. మూడు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపు పనులు కొలిక్కి రాలేదు. భూ సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చినా ఇంత వరకు నిధులు విడుదల చేయలేదని విమర్శలున్నాయి. 685 ఎకరాల భూ సేకరణకు రూ.113.39 కోట్లు కావాలని జిల్లా కలెక్టరు కోరారు. గుంటూరు ఛానల్ పరిధిలో 48 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు ఉద్దేశించిన ఈ పనులు ఇంత ప్రారంభం కాలేదు. 48 గ్రామాలకు తాగునీరు కూడా ఈ ఛానల్ ద్వారానే అందించే అవకాశం ఉంది.

టిడిపి ప్రభుత్వం హయాంలో రూ.378.25 కోట్ల అంచనాలతో ఛానల్ విస్తరణ, పొడిగింపునకు పరిపాలన ఆమోదం తెలిపారు. 2019 జనవరి 10న అంచనాలు మార్చివేసి రూ.274.53 కోట్లతో సింగిల్ ప్యాకేజి పనులు కింద పరిపాలన ఆమోదం తెలిపారు. ఆ తరువాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రతిపాదనలన్నీ మళ్లీ మొదటికి వచ్చాయి. మూడేళ్ల తరువాత గత ఏడాది ఆగస్టులో జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి చొరవ తీసుకుని భూ సేకరణకు ఉన్నతాధికారులతో చర్చించారు. సిఎం జగన్‌తో చర్చించి నిధుల

▶ 2లో



జెండా వందనం చేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు, ప్రేమ్‌కుమార్, విజయసారధి (ఇన్‌సెట్)

ఎన్‌ఇపికి యుటిఎఫ్ పూర్తి వ్యతిరేకం

- సిపిఎస్ రద్దు, ఒపిఎస్ పునరుద్ధరణ కోసం నిర్విరామ పోరాటం
- యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రథమకౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు - నూతన కమిటీ ఎన్నిక
- అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ప్రేమ్‌కుమార్, విజయసారధి

ప్రజాశక్తి - నరసరావుపేట

కుల, మతాలకు అతీతంగా అందరూ ఒకటేనని 800 ఏళ్ల కిందటే చెప్పిన బ్రహ్మనాయుడు పుట్టిన ప్రాంతమైన పల్నాడులో నేటికీ ఆర్థికంగా, విద్యాపరంగా వెనకబడి ఉందని ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. 60 శాతంగా ఉన్న పల్నాడు జిల్లా అక్షరాస్యతను పెంచేందుకు యుటిఎఫ్ సంస్కరణలు రూపొందించాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కొత్త రఘురామయ్య కళాశాల ఆడిటోరియం (నాగటి నారాయణ ప్రాంగణం)లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని కెఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించగా ఎటిఎఫ్ఐ జెండాను యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, యుటిఎఫ్ జెండాను యుటిఎఫ్ ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ గౌరవాధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఆర్టికల్ 21ఎ ప్రకారం ప్రాథమిక విద్య ప్రాథమిక హక్కు అని, దాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదని గుర్తు చేశారు. దేశంలో రెండు కోట్ల మంది బాల కార్మికులుంటే పల్నాడు జిల్లాలో 1.50 లక్షల మంది ఉన్నారని తెలిపారు. దేశంలో 50 శాతం విద్య

▶ 2లో

ప్లాస్టిక్ కవరులో పురిటిబిడ్డ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



పురిటి బిడ్డను ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి పడేసిన ఘటన గుంటూరు నగరంలో ఆదివారం వెలుగు చూసింది. కొత్తపేట పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరి వారితోట 5వ లైన్ క్రిస్టియన్‌పేట పరిధిలో ప్లాస్టిక్ కవర్‌లో నవజాత శిశువు ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అక్కడికెళ్లిన పోలీసులు శిశువును గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. కొద్ది గంటల క్రితమే జన్మించినట్లు ఉన్న శిశువుకు చికిత్స చేస్తున్నారు. తల్లి వివరాల కోసం పోలీసులు గాలిస్తున్నారు. శిశువుకు చికిత్స అనంతరం శిశుసంక్షేమ శాఖాధికారులకు అప్పగిస్తామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కొత్తపేట సిఐ శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు తక్కువనే భావనను రూపుమాపాలి

- అన్ని రంగాల్లో రాణిస్తున్నా తప్పని వివక్ష
- పోరాటాల ద్వారానే సమానత్వ సాధన
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి
- చిలువూరులో ఐద్వా వజ్రోత్సవాలు



ప్రజాశక్తి - దుగ్గిరాల



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి

మహిళలు తక్కువ.. అనే భావనను సమాజంలో రూపుమాపాలని, మహిళలకు రాజ్యాంగం కల్పించిన సమాన హక్కుల కోసం పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. ఐద్వా వజ్రోత్సవాల్లో భాగంగా మండలంలోని చిలువూరులోని రామతులసి కళ్యాణ మండపంలో సభ, సాంస్కృతిక కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా గుంటూరు జిల్లా కార్యదర్శి కె.పద్మ అధ్యక్షతన నిర్వహించిన సభలో రమాదేవి మాట్లాడుతూ పురుషులతో

▶ 2లో

సిఎంకు రైతు సంఘం లేఖ

ప్రజాశక్తి-తెనాలి

రైతుభరోసా పంపిణీని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 28న తెనాలి రానున్న నేపథ్యంలో డెల్టా ప్రాంత రైతు సమస్యలపై ముఖ్యమంత్రికి ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి లేఖ రాశారు. లేఖ సారాంశాన్ని స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం వివరించారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో దాదాపు 5.75 లక్షల ఎకరాల సాగు భూమి ఉందని, ఈ ప్రాంతంలో సాగునీటి కాల్వలు, డ్రెయినేజ్ పూడికలు తీయపోవటంతో ప్రతి ఏటా సంభవించే అధిక వర్షాలు, తుపానుల దెబ్బకు రైతులు పంట నష్టపోతున్నారని తెలిపారు. ముఖ్యంగా కొల్లిపర మండలం అత్తలూరిపాలెం వద్ద ఏర్పాటు చేసిన డ్రెయినేజీ సిస్టంతోనూ రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పిడపర్రు లాకులు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. తెనాలి-రేపల్లె రైలు మార్గంలో చినరావూరు-జంపని స్టేషన్ల మధ్య లెవెల్ క్రాసింగ్ మూసివేయటంతో ఎనిమిది మండలాలకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దాదాపు ఐదు వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్న పసుపును క్వింటాళ్ కేవలం రూ.5,600కే కొంటున్నారని, కనీసం రూ.10 వేలకు ధరను పెంచాలని కోరారు. మార్కెట్ యార్డు సెస్సు ద్వారా లింకురోడ్ల నిర్మాణం చేపట్టాలని, రైతు బంధు పథకం ద్వారా యార్డులో ధాన్యం, అపరాలు నిల్వ చేసుకునే అవకాశం కల్పించాలని, ఓసీ రైతులకూడా రైతు భరోసాను వర్తింపజేయాలని లేఖలో కోరామని వివరించారు.

మరమ్మతులకు నీళ్లు

(మొదటి పేజీ తరువాయి)

విడుదలకు గ్రీన్ సిగ్నల్ తీసుకున్నా ఇంత వరకు నిధులు జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ కాలేదు.

గతేడాది పెదనందిపాడు, కాకుమాను, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఖరీఫ్ ప్రారంభంలో నీరు లేక ఇబ్బందులు, తీరా అక్టోబరులో అధిక వర్షాలకు ముంపు సమస్యలతో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల రైతులు నష్టపోయారు. కాల్వల మరమ్మతులు సకాలంలో జరగక ప్రతియేటా వరి, పత్తి,అపరాల సాగుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోనూ కాల్వల నిర్వహణ లేక గతేడాది ముంపు సమస్య ఏర్పడింది.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు, శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని వారి సంయుక్త ఆధ్వర్యంలో రావిపాటి మల్లికార్జునరావు చింతలపూడి వారి సహకారంతో ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 850 మంది కంటి పరీక్షలు చేయగా 404 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్‌కు సిపార్సు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరాన్ని అధ్యక్షులు బోడపాటి రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయటం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. ఈ వైద్య శిబిరంలో శంకర కంటి ఆసుపత్రి నుండి డా.దివ్యభార్గవి, డా మెహబూబ్,డా ఋతుజా ఇతర హాస్పిటల్ సిబ్బంది రోటరీ ప్రెసిడెంట్ బి. రామారావు,సెక్రటరీ బండారుపల్లి శ్రీనివాసరావు, రామినేని కిషోరుబాబు, పి.రవీంద్రనాథ్ , మేగనాథ్ , వి.వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు. పాఠశాల ఎన్‌సిసి,ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వాలేంటీర్లుగా సేవలు అందించి విజయవంతం చేశారు.



సమావేశంలో మాట్లాడుత్ను దాసరి రాజు మాస్టారు

'కన్నాపై విమర్శలు తగవు'

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపిలో చేరిన మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణపై వైసిపి నాయకులు అవాకులు, చవాకులు మాట్లాటడం మానుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాస్టారు అన్నారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా, 14 ఏళ్లు మంత్రిగా పదవులను నిర్వహించిన కన్నాపై కొంత మంది నాయకులు అసూయ, అక్కసుతో మాట్లాడుతున్నారని అన్నారు. పొంతన లేని అంశాలను తెరపైకి తెచ్చి మాట్లాడుతున్న నాయకులు ముందు వారి పరిధి ఏమిటో తెలుసుకోవాలన్నారు. కన్నా టిడిపిలో చేరడంతో వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడ్తున్నాయని అన్నారు. కన్నా సైకిలు ఎక్కితేనే అంతగా భయపడుతున్న వైసిపి నాయకులు ఆయన సైకిల్ యాత్ర చేస్తే తట్టుకోలేరని అన్నారు. సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు కంచర్ల శివరామయ్య, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

ఎన్ఇపికి యుటిఎఫ్ పూర్తి వ్యతిరేకం

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేటీకరణ అయ్యిందని, దాన్ని ఇంకా పెంచడానికి, మతతత్వాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానం (ఎన్ఇపి-2020)కు యుటిఎఫ్ సంపూర్ణ వ్యతిరేకమని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ప్రభుత్వం కళాశాలలు ఏర్పాటు చేసి విద్యాభివద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసేలా విలీన ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, తన అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయులకు ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. పలాస నుండి అనంతపురం వరకు యుటిఎఫ్ చేపట్టిన బస్సు యాత్రలో 100కు పైగా ప్రాథమిక పాఠశాలలు పరిశీలించి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత గుర్తించామని చెప్పారు. ప్రభుత్వం చెబుతున్న జిపిఎస్‌ను ఎలా అమలు చేయాలో కూడా వారికి తెలీదని, అయినా అర్థంకాని ప్రకటనలు ఇస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సిపిఎస్ రద్దు, ఒపిఎస్ పునరుద్ధరణకు యుటిఎఫ్ నిక్కచ్చిగా పోరాడాలని పిలుపునిచ్చారు. 2007లో ఊపిరి పోసుకున్న పిడిఎఫ్ నిర్మాణాత్మక ప్రతిపక్షమని, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తొలి నుండీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత, ప్రజల కోసం పాటుపడుతోందని, ఉత్తరాంధ్ర, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలో పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపుకు యుటిఎఫ్ కృషి చేయాలని కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై మాట్లాడే ధైర్యం వైసిపి, టిడిపి, జనసేనకు లేవని, కేంద్ర ప్రభుత్వ విధానాలపై మండలిలో పిడిఎఫ్ అభ్యర్థులే గళమిప్పుతారని ఉద్ఘాటించారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్-ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలల విలీనం వల్ల పిల్లలు చదువులకు దూరం కావడమే కాకుండా వేలాది టీచర్ పోస్టులు రద్దయ్యాయని, ఇది నిరుద్యోగులకూ నష్టమని అన్నారు.

యూటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి ఒత్తిడి వల్ల రాష్ట్ర స్థాయి నుండి మండల స్థాయి వరకు అధికారులందరూ ఉపాధ్యాయులను దోషులుగా చూపుతున్నారని విమర్శించారు. అయినా స్థైర్యం కోల్పోకుండా ఉపాధ్యాయులు వ్యవహరించాలని, యుటిఎఫ్ ఉపాధ్యాయులు హక్కులు, బాధ్యతలు గుర్తెరిగి ఆదర్శంగా నిలవాలని కోరారు. అనంతరం సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయనాయక్ సౌహార్ధ సందేశమిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే ప్రజ్యాతిరేక విధానాలపై యుటిఎఫ్, సిఐటియు కలిసి ఉద్యమించాలన్నారు. అనంతరం జాతీయ విద్యావిధానం వల్ల కలిగే నష్టాలు, విద్యారంగంలో వస్తున్న పరిణామాలు, ఉపాధ్యాయుల సమస్యలపై ఎ.నాగేశ్వరరావు, ఇతర నాయకులు మాట్లాడారు.

నూతన కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా యుటిఎఫ్ పల్నాడు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, అధ్యక్షులుగా పి.ప్రేమ్‌కుమార్, సహాధ్యక్షులుగా ఎం.మోహన్‌రావు, సహాధ్యక్షురాలుగా ఎ.బాగేశ్వరిదేవి, ప్రధాన కార్యదర్శిగా జి.విజయసారధి, కోశాధికారిగా జె.వాల్యా నాయక్, ఆఫీస్ బేరర్స్ ఎన్నికయ్యారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ టి.ఎస్.ఎల్.ఎన్ మల్లేశ్వరరావు, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎన్.కుమార్‌రాజా, నాయకులు ఎన్.సుందరరావు, టి.తిరుపతిస్వామి, షేక్ జమాల్, సిపిఎస్ జిల్లా కమిటీ కన్వీనర్ టి.అరుణ్ కుమార్, ఎమ్‌డి అబ్దుల్ గఫార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు తక్కువనే భావనను రూపుమాపాలి

(మొదటి పేజీ తరువాయి)

పోటీపడి మహిళలు ఉద్యోగాలు సంపాదిస్తున్నా, అన్ని రంగాల్లో రాణిస్తూ తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటున్నా వివక్ష మాత్రం పోవడం లేదన్నారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా సామాజికంగా సమాన హక్కులు ఇంకా సాధించాల్సి ఉందని, ఇందుకు పోరాటాలే మార్గమని చెప్పారు. మహిళలను అణచిపెట్టే మతోన్మాద శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆడపిల్లలకు రక్షణ కరువైందని, 47 శాతం మందికి ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఆస్తిలో మహిళలకు సమాన వాటా హక్కు ఇప్పటికీ సరిగా అమలు కావడం లేదన్నారు. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు, మత్తు పదార్థాలయోగాల వల్ల కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని, ఇది ఒత్తిడి మహిళలపై ఎక్కువగా పడుతోందని చెప్పారు.

ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, మద్యం, అశ్లీలత చిత్రాల వల్ల మహిళల ఆత్మ గౌరవానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని చెప్పారు. మహిళలపై హింసను నివారించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, నిర్భయ, పోక్సో చట్టాలు, దిశ యాప్‌లు తెచ్చినా అత్యాచారాలను అరికట్టలేకపోతున్నారని అన్నారు. కె.పద్మ మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలతో పాటు కుటుంబ సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించామని, జిల్లా, మండల కేంద్రాల్లో మోటూరు ఉదయం ట్రస్ట్ పేరుతో వివిధ సమస్యల పరిష్కారానికి సలహాలు ఇస్తున్నామని వివరించారు. పోలీస్‌స్టేషన్లు, కోర్టులకు వెళ్లకుండా సత్వర న్యాయం అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా కుటుంబ న్యాయ సలహా కేంద్రాలు, వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మాజీ జెడ్‌పిటిసి యేళ్ల జయలక్ష్మి మాట్లాడుతూ ప్రతిరోజూ అఘాయిత్యాల వార్తలు చూస్తున్నామని, అయితే వీటికి కారణాలపై సరిగా ఆలోచించడం లేదని అన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకొచ్చినప్పుడే వీటిని తిప్పికొట్టగలమని చెప్పారు. స్థానిక సంస్థల్లోనే రిజర్వేషన్లు ఇచ్చారని, చట్టసభల్లో రిజర్వేషన్ల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ముందు భాగంలో కోలాట ప్రదర్శన కోలాహలంగా సాగింది. సభ అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో మహిళలు, బాలలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాణిక్యం ఎంపిటిసి మరియా రోజమ్మ, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసకుమారి, మండల అధ్యక్షులు వై.స్వర్ణ గౌరీ, కార్యదర్శి ఎస్.అరుణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.బాలరాజు, ఇ.అప్పారావు, నాయకులు వి.సాంబశివరావు, వై.బ్రహ్మేశ్వరరావు, జి.యోహాను, ఎం.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు



ప్రదర్శన ముందు భాగాన కోలాట ప్రదర్శన



సభకు హాజరైన మహిళలు



మాట్లాడుతున్న ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి తిమ్మన్న

ఉపాధ్యాయులను భయపెడితే తిరుగుబాటు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలోని రెండు లక్షల మంది ఉపాధ్యాయులు అధికారుల తీరు పట్ల భయం గుప్పిట్లో, తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఇది ఇలాగే కొనసాగితే ఉపాధ్యాయులంతా తిరుగుబాటు చేయాల్సి వస్తుందని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం స్థానిక కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో ఎస్‌టియు జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశాన్ని గేరా మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మన్న, ఎస్‌టియు రాష్ట్ర పూర్వపు అధ్యక్షులు సిహెచ్ జోసెఫ్ సుధీర్ బాబులు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారుల తీరు వల్ల, ప్రత్యేకించి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వైఖరి వలన ఉపాధ్యాయులు నిత్యం భయంతో విధులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. అధికారులు ఎప్పుడు ఎక్కడ సందర్శించి ఎవరిని సస్పెండ్ చేస్తారోనని అందోళనకు గురవుతున్నారన్నారు. విద్యాశాఖ ఈ విద్యా సంవత్సరం ఏ ఒక్క పాఠశాలకైనా సకాలంలో, పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారా అని ప్రశ్నించారు. దాదాపు 6 నెలలపాటు పాఠ్యపుస్తకాలు ఒకదాని తర్వాత ఒకటి పంపిణీ చేశారని, దీని వల్లనే చాలా పాఠశాలల్లో ఇప్పటి వరకూ పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో అందలేదన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల్ని సమాజం దృష్టిలో తక్కువ చేసి చూపించే ఆలోచన చేస్తుందని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇ.అంబరీష్యుడు తదితరులు మాట్లాడారు.



మునగాల మల్లేశ్వరరావు సత్కరిస్తున్న నాయకులు

మల్లేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి:మంగళగిరిలో నూతనంగా వైసిపి జిల్లా చేనేత విభాగం అధ్యక్షునిగా నియమితులైన మునగాల మల్లేశ్వరరావును ఆదివారం ఆయన నివాస గృహంలో స్థానిక గంగ భగీరథ సగర సంఘం నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మునగాలను శాలువాతో పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు పందేటి సాంబశివరావు, జూట్రు ఏడుకొండలు, నాయకులు గండికోట అచ్చయ్య, కటారి వెంకటేశ్వరరావు, కలవకొల్లు గోపిబాబు, నంద్యాల గోపాలకృష్ణ తదితరులు మునగాలను అభినందించిన వారిలో ఉన్నారు.

అట్రాసిటీ కేసు రాజీ కోసం మహిళపై దాడి

ప్రజాశక్తి - నాదెండ్ల

తనపై పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును రాజీ చేసు కోవాలని దళిత మహిళపై పెత్తందారీ సామాజిక తరగతికి చెందిన వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరులో ఆదివారం వెలుగు చూసిన ఘట నపై బాధిత మహిళ కథనం ప్రకారం.. గ్రామానికి సందిరెడ్డి అశోక్ పొలం పక్కనే అదే గ్రామానికి చెందిన కోట యాకోబు, రాణి దంపతులు కౌలుకు వ్యవసాయం చేస్తుంటారు. పొలా లకు నీరు పెట్టుకునే విషయంలో గతంలో వీరికి వివాదాలొచ్చాయి. ఈ క్రమంలో నెల కిందట యాకోబుపై అశోక్ కొడవలితో దాడి చేయడంతో యాకోబుకు తల పగిలింది. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా అశోక్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది. అయితే ఈ కేసులో రాజీకి రావాలంటూ బాధితులను అశోక్ వత్తిడి చేస్తున్నాడు. ఈ క్రమంలో రాణి శనివారం నరసరావుపేటకు కూలి పనులకు వెళ్లి రాత్రి 8 గంటలకు గ్రామానికి చేరు కున్నారు. ఇంటికి వెళుతుండగా స్థానిక సొసైటీ వద్ద అప్పటికే మద్యం సేవించి కాపు గాచిన అశోక్ ఆమెపై వాదనకు దిగా డని, కేసు రాజీ చేసు కోవా లంటూ కత్తితో దాడి చేశాడని బాధితురాలు చెబుతోంది. ప్రస్తుతం ఆమె నరస రావుపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.





'రాష్ట్రాన్ని రావణకాష్టంలా మారుస్తున్నారు'

ప్రజాశక్తి - బెల్లంకొండ

బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కొడుకు వైఎస్ జగన్‌కు తెలుసని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఆరోపించారు. మండలంలోని మాచాయపాలెంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజ శేఖర్ రెడ్డిపై అభిమానంతో ఒక్కసారి ప్రజలు జగన్‌కు అవకాశం ఇచ్చి నందుకు రాష్ట్రాన్ని రావణకాష్టంలా మారుస్తున్నారని విమర్శించారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని ప్రజలకు ఎవరైతే మేలు చేస్తారో, ఎవరైతే అభివృద్ధి చేస్తారో వారికే ప్రజలు పట్టం కడతారని అన్నారు. ఆ విషయం మరిచి తెలుగుదేశం పార్టీ కార్యాలయాలపై నాయకులపై దాడులు చేయటం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ప్రజలపై, ప్రతిపక్ష పార్టీలపై పాలకుల తీరు బాధాకరంగా ఉందని అన్నారు.

అంకమ్మతల్లి తిరునాళ్ల

ప్రజాశక్తి-రాజుపాలెం

మండల కేంద్రంలో అంకమ్మతల్లి తిరునాళ్లను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుండే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు తమ మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయకమిటి వారు దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం సమయంలో గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు మంత్రి అంబటి రాంబాబు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్భహించారు.

అన్ని తరగతులనూ నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి- పిడుగురాళ్ల



పట్టణ, మండలంలోని గౌడ సంఘీయులతో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం సమావేశం నిర్వహించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల కోసం పనిచేస్తూ వారి సంక్షేమా నికి పాటుపడుతోందని అన్నారు. గురజాల నియో జకవర్గంలో కూడా గతంలో బీసీ లోని అన్ని చిన్నచిన్న కులాలను కూడా గౌరవిస్తూ వారిని కూడా సామాజికంగా, రాజకీయంగా,ఆర్థికంగా అభివృద్ధి చేసే దిశగా పని చేశా మన్నారు. వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాలను నిర్లక్ష్యం చేస్తూ వారి సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. వారిపై దాడులు చేస్తూ పరిపాలన సాగిస్తోందని దుయ్య బట్టారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన యడవల్లి ఏడుకొండలును పల్నాడు జిల్లా గౌడ సంఘ సాధికారక సమితి సభ్యులుగా, అట్ల మురళీకృష్ణను పిడుగురాళ్ల మండల గౌడ సంఘ సాధికార సమితి అధ్యక్షులుగా నియమించారు. కార్యక్రమంలో పిడుగు రాళ్ల మండల టిడిపి కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకట సాంబశివ రావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పి.రవి, పిడుగురాళ్ల పట్టణ పార్టీ అధ్యక్షులు పాండురంగ శ్రీను, పల్నాడు జిల్లా మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలి, పట్టణ టీఎన్టీయూసీ అధ్యక్షులు యరగాని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులు బతికే పరిస్థితి లేదు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక 32వ వార్డులోని మార్కండేయనగర్‌లో తెలుగుదేశం పార్టీ మహిళా నేతల ఆధ్వర్యంలో మాటా-మంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి జరీనా సుల్తానా మాట్లాడుతూ చంద్రబాబు పేరు చెబితే వైసిపి శ్రేణులకు వైసీపీ శ్రేణులకు వెన్నులో వణుకు పుడుతోందని ఎద్దేవా చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై ఆ వార్డు ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా, పలువురు మహిళా నేతలు మాట్లాడతూ, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డ దగ్గర నుండి వంటగ్యాస్ సిలిండర్ ధరలు , నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల సామాన్య ప్రజలు బతికే పరిస్థితి లేదని అన్నారు. బెల్టు షాపులు ఏర్పాటు చేసి పేద కుటుంబాలతో అడుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఎ.రమాదేవి, నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి, టౌన్ మహిళా అధ్యక్షురాలు అనిత బాయి, టిడిపి సీనియర్ నాయ కులు బి.శ్రీదేవి, మోతీ బాయి, వీరాకుమారి, 32 వ వార్డు మహిళలు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-వినుకొండ

ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గ సభ్యులను ఆదివారం ఆరాధనలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొదటగా సంఘ అధ్యక్షులుగా పి.సాల్మన్ రాజు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్. ఆనందరావు, వైస్ సెక్రటరిగా కె.నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా పి.డానియెల్, సభ్యులుగా వై.వరప్రసాద్, బెజవాడ రూబెన్ రాజు , కత్తి జాన్, కృపాదానం, గుంటూరు అబ్రహాంలింకన్, కె.మనిరాజ్ , పి. కిరణ్ కుమార్, పి.ప్రభాకర్, డి.పోలయ్య, కె. పథ్వీ రాజ్, జి.జాన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సంఘ కాపరి రెవరెండ్ పత్రా ఫిలిప్ ఎన్నుకున్న సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గాన్ని సంఘ పెద్దలు, పూర్వపాలకవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.

జీవాల పెంపకంతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి- గుంటూరు



కోళ్ళు, మేకలు, గొర్రెలు పెంపకంతో రైతులు ఆనందంగా ఆదాయం పొందవచ్చని వెటర్నరీ డాక్టరు గంగవరపు రామకష్ణ అన్నారు. ఆదివారం రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగు విధానం, కషాయాలు మిశ్రమాల తయారీ తదితర అంశాలపై గుంటూరు జిల్లా ,పుల్లడిగుంట దగ్గరలోని కొర్నెపాడు లోనిర్వహించిన రైతు నేస్తం ఆధ్వర్యంలో జరుగుతున్న మూడు రోజుల వర్క్‌షాపులో ఆయన పాల్గొని మాట్లాడారు. పశుపోషణలో కోళ్ళు, మేకలు, గొర్రెలు మొదలగు వాటి పెంపకాన్ని కూడా చేపట్టగలగాలన్నారు. కార్యక్రమంలో పకతిక రైతు ఏడుకొండలు , రైతునేస్తం ఫౌండేషన్ సీఈఓ. సాంబశివరావు పాల్గొన్నారు.బహుళ అంచెల సాగు విధానం గురించి పిడుగురాళ్ళ రైతు ఏడుకొండలు మాట్లాడుతూ తక్కువ స్థలంలో ఎక్కువ పంటలు పండించాలని సూచించారు. శిక్షణలో భాగంగా ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన గోశాల, కట్టెగానుగతో నూనె తీసే ప్రక్రియ, వానపాముల ఎరువు, ఘనజీవామతం తయారీ విధానం ప్రత్యక్షంగా చూపించడం జరిగింది. రాబోయే రెండు రోజులలో తేనెటీగల పెంపకం, బిస్కెట్లు, టమాట సాసు, చిరుధాన్యాలతో వంటకాలు లాంటి వాటిపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపరు.

ఉరేసుకుని ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్



మండలంలోని అన్నపర్రు గ్రామానికి చెందిన కొల్లా కోటేశ్వం రావు(40) శనివారం రాత్రి ఉరివేసు కొని మృతి చెం దాడు మృతుడి తండ్రి తిరుపతయ్య ఆదివారం పెదనంది పాడు పోలీస్ స్టేషన్ లో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. పెదనందిపాడు ఎస్ఐ షేక్ రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు మృతుడి తండ్రి తెలిపిన సమాచారం మేరకు కోటేశ్వరరావు కొంతకాలంగా విత్తనాలు కంపెనీలో పని చేస్తున్నాడు. మానసిక ఒత్తిడి కారణంగా మద్యం సేవించి ఆత్మహత్యకు పాల్గొని ఉండవచ్చని తెలిపారు. ఆదివారం బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృత దేహాన్ని అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



నకిలీ బంగారంతో మోసం - ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం మునుకుదురు గ్రామానికి చెందిన ఉసిరికాయల శాంతి పొన్నూరులోని కసుకర్రు గ్రామం వెళ్లే రోడ్డులో కొబ్బరికాయల కొట్టు పెట్టుకొని జీవనం సాగించేంది. ఈ క్రమంలో మగ వ్యక్తి,ఆడ మనిషి ఇద్దరు వ్యక్తులు ఆమె వద్దకు వచ్చి బంగారపు రంగు కలిగిన ఇత్తడి బిళ్ళ ఇచ్చారు. ఇది నిజమైన బంగాంం అని ఆమెను నమ్మించి ఆమె వద్ద రెండు లక్షల రూపాయలు తీసుకువెళ్లారు. దానిని బంగారం దుకాణంలో తనిఖీ చేయించగా అది నకిలీ బంగారం అని తేలింది. దీంతో, ఆ ఇద్దరి చేతిలో మోసపోయానని తెలుసుకొన్న ఆమె, అర్బన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తమకు అందిన సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం నారాకోడూరు బస్టాండ్ సెంటర్ వద్ద నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సిఐ తెలిపారు. నిందితులను కోర్టు వారి ఎదుట హాజరు పరుస్తామని చెప్పారు.



బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై కేసు

ప్రజాశక్తి-తెనాలి

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న మందు బాబులపై రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పెదరావూరు, పరిమి డొంక ప్రాంతాలలో ఆయన తనిఖీలు చేశారు .ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందు బాబులను పట్టుకున్నారు. పదిమందిపై కేసులు నమోదు చేశారు. వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే అసాంఘిక కార్యకలాపాలపై ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

అక్రమార్కుల రంపపు కోత..

- పచ్చని చెట్లు నరికివేత
- పర్యావరణానికి తూట్లు
- అధికారుల ప్రేక్షకపాత్ర

ప్రజాశక్తి-వినుకొండ

'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు', 'మొక్కలు నాటాలి.. పరిరక్షించాలి', 'చెట్లు నరకడం చట్ట విరుద్ధం' అంటూ ప్రభుత్వం ప్రకటనలు చేయడమే తప్ప, వాటిని నరికి వేస్తుంటే నియంత్రణా చర్యలు శూన్య మేనా? ఏకంచె చేను మేస్తే' అన్న చందంగా ప్రభుత్వాధికారులు, పాలకులు కొందరు పచ్చని చెట్లను నరికేసి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఒకవైపు ప్రభుత్వం మొక్కలు విరివిరిగా నాటుతుంటే, మరోవైపు కొందరు స్వార్ధపరులు, అక్రమార్కులు విలువైన పెద్ద పెద్ద చెట్లను నరికివేస్తున్నారు.


వినుకొండలోని నరసరావుపేటరోడ్డులో భారీగా నరికివేతకు గురైన చెట్లు

వినుకొండ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని ఎన్ఎస్‌పి కాలనీ ఆనుకొని కర్నూలు- గుంటూరు జాతీయ రహదారి పక్కనే ఉన్న పెద్ద పెద్ద చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా మునిసిపల్ సిబ్బంది నరికి వేశారు. సుమారు ఐదు దశాబ్దాల నాటి ఈ చెట్లను అర్ధాంతరంగా నరికి వేయడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఎస్పి కాలనీ వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా నేషనల్ హైవే శాఖ అనుమతులు లేకుండా మునిసిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు అండ దండలతో రోడ్డు విస్తరణ చేస్తున్నారు. ఇందులో భాగంగా అడ్డుగా ఉన్న భారీ వృక్షాలను గత రెండు రోజులుగా నరికి వేస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సుమారు 8 భారీ వేప చెట్లను నరికించి, అక్రమంగా మొద్దులు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్లు, పొక్లెయినర్లు, రంపపు యంత్రాల సహాయంతో భారీ చెట్లను నరికేశారు. గత రెండు నెలలుగా పట్టణంలో అభివృద్ధి పేరుతో ఆక్రమణల తొలగింపు, రోడ్లకు ఇరువైపులా ఉన్న భారీ చెట్లను అధికారులు తొలగిస్తూనే ఉన్నారు. వినుకొండకు సీఎం ఇటీవల వచ్చిన సందర్భంగా కారంపూడి రోడ్డులోని పెద్ద పెద్ద చెట్ల తో పాటు, డివైడర్ పై ఉన్న చెట్లను కూడా తొలగించారు. మార్కాపురం రోడ్ లోని చెక్‌పోస్ట్ సెంటర్‌లో గత నెలలో భారీ చెట్లను మున్సిపల్ అధికారులు నరికించారు. ప్రస్తుతం నరసరావుపేట రోడ్డు ఎన్ఎస్‌పి కాలనీ వద్ద ఐలాండ్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేసి జాతీయ రహదారిపై ఒకరి విగ్రహం ఏర్పాటు చేసి దాని చుట్టూ గోడ, ఫౌంటెన్ ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే జాతీయ రహదారిపై అనుమతులు లేకుండా పనులు వేగవంతంగా చేపట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను అధికారులు తొలగిస్తున్నారు. ఈ నేప థ్యంలో మునిసిపాలిటిలో అధికారులు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తూ ప్రభుత్వ సంపదను వాళ్లకు అనుకూలమైన వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఎన్ఎస్‌పికి చెందిన సుమారు 21 ఎకరాల భూమిని ప్రభుత్వం మున్సిపాలిటీకి అప్పగించింది. కానీ, ఆ భూమిలో ఉన్న క్వార్టర్స్‌ను తొలగించేందుకు అనుమతులు లేకపోయినా మునిసిపల్ అధికారులు వాటిని కూల్చివేసి వందలకొద్దీ చెట్లను నరికించి, ఇటు కలపను, అటు కూల్చివేసిన క్వార్టర్ల మెటీరియల్‌ను అమ్ముకొని సుమారు నాలుగు కోట్ల ప్రభుత్వ సంపదను స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అభివృద్ధి పేరుతో ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్న సంబంధిత ఉన్నతాధికారులు కూడా చర్యలు తీసుకోకపోవడం వలన మున్సిపాలిటి అధికారులకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. మున్సిపల్ అధికారులు బహిరంగంగా భారీ వృక్షాలను అక్రమంగా నరికించి సొమ్ము చేసుకుంటున్న అటవీశాఖ, రెవిన్యూ శాఖ అధికారులు మాత్రం ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన కొందరు అధికారులు, అనధికారికంగా చెట్ల నరికివేతపై సం బంధిత శాఖ ఉన్నత అధికారులు స్పం దించి విలువైన చెట్లు రంపపు కోతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతి ఇవ్వలేదు

ఈ విషయమై వినుకొండ అటవీ శాఖ రేంజర్ హుస్సేన్ ను వివరణ కోరగా నరసరావుపేట రోడ్డులో జాతీయ రహదారికి పక్కన చెట్లు తొలగింపునకు తాము ఎటువంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. అక్ర మంగా చెట్లు తొలగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.



వినుకొండలోని నరసరావుపేటరోడ్డులో ..

240 మందికి ఉచిత వైద్యసేవలు



ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు అభివృద్ధి కమిటి, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక పిఆర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. దాదాపు 240 మంది బిపి,షుగర్ పేషెంట్లకు మందులను రెండు నెలలకు సరిపడా అందజేశారు. సీనియర్ వైద్యులు లింగమల మోహన్ భాస్కర్, జూనియర్ వైద్యులు సొంటినేని లిఖిత, ఎన్ నవ్యశ్రీ, రాజశ్రీలు, పేషెంట్లకు తగు సూచనలు చేశారు వైద్యశిబిరంలో అభివృద్ధి కమిటి సభ్యులు పాల్గొన్నారు.



ఉచిత మెగా కేన్సర్ నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్థానిక మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య, కేన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పటల్‌కు చెందిన సదాశివరెడ్డి, ప్రధానోపా ధ్యాయు రాలు ఎల్. ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ శిబిరాన్ని గురజాల కు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్ సహ కారంతో,తానా ఫౌండేషన్ (ఉత్తర అమెరికా తెలుగు సంఘం), బసవతారకం ఇండో- అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 643 మంది రోగులను పరీక్షించి వీరిలో అవసరమైన వారికి అల్ట్రా సౌండ్ స్కానింగ్ ,ఈసీజీ, పాప్ స్మియర్ , మెమోగ్రఫీ, ఎక్సరే పరీక్షలు ఉచితముగా నిర్వహించి రోగులందరికీ మందులు పంపిణీ నిర్వహించారు. బసవతారకం ఇండో- అమెరికన్ కేన్సర్ ఆసుపత్రి సిబ్బందితో పాటు విజయవాడ, గుంటూరుకు చెందిన వైద్యులు సేవ లందించారు. కార్యక్రమంలో చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ వైద్యులు డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, ఎన్‌సిసి ఆఫీసర్ ఇమ్మా నియేల్‌రాజు, స్కౌట్ మాస్టర్ ఎన్. హనుమంతరావు, ఉపాధ్యాయులు వెంకట్రావు, ఎన్‌సిసి అండ్ స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్కువ మందిలో పోషకాహార లేమి

ప్రజాశక్తి-విజయపురిసౌత్



మాచర్ల రూరల్ కొత్తూ రులో క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంస్థ 140 మం దికి ఆదివారం వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అంద జేసింది. మండల ప్రాథ మిక పాఠశాలలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి గ్రామీ ణుల నుంచి విశేష స్పందన లభించింది. గైనకాలజిస్ట్ డాక్టర్ లీల, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సుకన్య, ఆర్థోపిడీషియన్లు డాక్టర్ సుకన్య, డాక్టర్ ఆశాలత, ఎల్.వి. ప్రసాద్ నేత్రవైద్య నిపుణులు, గ్రామీణులకు వైద్యసేవలు అం దించారు. బిపి, డయాబెటిక్ పరీక్షలు నిర్వహించామని, ఎక్కువ మంది పోష కాహార లేమితో, నేత్ర, ఎముకల సమ స్యలతో బాధపడుతున్నారని క్రాఫ్ట్ కౌన్సిల్ కార్యదర్శి రంజన, సభ్యురాలు సుజాత తెలిపారు. ఆకు కూర లు, పండ్లు తినాలని వారికి చెప్పారు.ఈ సందర్భంగా కర పత్రాలను పంపిణీ చేశారు.



కొమెరపూడి విఆర్‌ఎపై దాడి దుర్మార్గం

- తహశీల్దార్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- సిపిఎం సత్తెనపల్లి పట్టణ కమిటి డిమాండ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామ విఆర్ఎ కురబండి శ్రీనివాసరావుపై తహశీల్దార్ నగేష్ దాడి చేయడం దుర్మార్గమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఎం సత్తెనపల్లి పట్టణ కమిటీ తెలిపింది. తహశీల్దార్ పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఆయనను అరెస్టు చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ధరణికోట విమల డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పుతుంబాక భవన్‌లో జరిగిన పార్టీ పట్టణ కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కట్ట శివ దుర్గారావు అధ్యక్షత వహించారు విమల మాట్లాడుతూ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న విఆర్‌ఎను తహసిల్దార్ ఆఫీసుకు పిలిపించారని,ఈ క్రమంలో ఫోను తీసుకొని రావడం మర్చిపోయిన విఆర్‌ఎపై ఆగ్రహం తో దాడి చేయడం దుర్మార్గమన్నారు. సమావేశంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు అనుముల వీరబ్రహ్మం, రొంపిచర్ల పురుషోత్తం, జడ రాజకుమార్, పంతంగి ప్రభాకర్, హరి పోతురాజు, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

1న ఈపూరు మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-ఈపూరు: మండల సర్వసభ్య సమావేశం మార్చి 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎ.ఉషాకిరణ్ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు అధికారులు హాజరుకావాలని ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



ఎల్ఐసి ఏజెంట్ల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-వినుకొండ

స్థానిక ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో ఎల్ఐసి ఏజెంట్ల సర్వ సభ్య సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా జోనల్ లియాఫీ ప్రెసిడెంట్ మార్కండేయులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెంట్లు సమైక్యంగా పోరాడి వారి కోర్కెలను సాధించుకోవాలని పిలుపు నిచ్చారు. డివిజన్ ప్రెసిడెంట్ రాంబాబు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఉండి సమస్యలు పరిష్కరించు కోవాలని సూచించారు. బ్రాంచ్ ప్రెసిడెంట్‌గా చెరుకూరి హరనాధ్‌బాబు మరొమారు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా కాకుమాను కోటేశ్వరరావు, ట్రెజరర్‌గా గోదా ఏడు కొండలురెడ్డి,వైస్ ప్రెసి డెంట్లుగా చింతా ఆదిరెడ్డి, గోలి వెంకటేశ్వరరావు, కాళ్ల విజయ్ కుమార్,జడ్డా శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మాదాల హనుమంతరావు, జాయింట్ సెక్ర టరీగా పాలడుగు నాగమల్లేశ్వరరావు, డివి సుబ్బయ్య, రొడ్డ రాంరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా చెరుకూరి కోటి రామ మూర్తి, గౌరవ సలహాదారులుగా గాలి రమణను ఏక గ్రీవంగా ఆమోదించారు.


గుంటూరు కన్నా పాఠశాల ప్రదర్శనలో ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి


తెనాలిలో ప్రదర్శనను తిలకిస్తున్న ఉమామహేశ్వర్, సంజీవ్‌బాబు, సరోజ

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక పాత గుంటూరు కన్నా పాఠశాలలో మూడ్రోజులు పాటు నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పర్యావరణం, భౌతిక, రసాయనక, మానవ నిర్మాణ శాస్త్రాలతో పాటు, మేథమెటిక్స్, జువాలజీ తదితర అంశాలు నూతనంగా ప్రవేశపెట్టిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్, అతిపెద్ద విమానాశ్రయం తదితర 600కు పైగా నమూనాలను విద్యార్థులు ప్రదర్శించి అబ్బురపరిచ్చారు. స్వాతంత్ర సమరయోధుల వేషధారణలతో చిన్నారులు, తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా బాలబాలికల లఘు ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్య అతిథులుగా హాజరై ప్రదర్శనను ప్రారంభించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా నగరంలోని పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ వందలాది మందిని దేశ విదేశాల్లో స్థిరపడేలా చేసిన కన్నా మాస్టారు గుంటూరు గర్వించదగ్గ విద్యాదాత అని ప్రశంసించారు. కన్న మాస్టారు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేలా వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని, అందుకు అనుగుణంగా అన్ని స్థాయిల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, స్థానిక కార్పొరేటర్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో విద్య, వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను ప్రిన్సిపాల్ డాక్టర్ జేమ్స్‌మోర్లే ఆదివారం ప్రారంభించారు. సైన్స్, సోషల్, గణితం, ఇంగ్లీష్ పాఠ్యాంశాలపై విద్యార్థులు తయారు చేసి, ప్రదర్శించిన అంశాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ళ ఉమామహేశ్వర్, కెమిస్ట్రీ విభాగాధిపతి సంజీవ్‌బాబు, బారతి విద్యాలయం సీనియర్ సెకండరీ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ వి.సరోజ ప్రదర్శనను తిలకించారు. ప్రదర్శనలపై విద్యార్థుల విశ్లేషణను వారు అభినందించారు. పాఠశాలలో బోధనా పద్ధతులు నూతన విద్యావిదానానికి అనుగుణంగా ఉన్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గోపాలకృష్ణమూర్తిని సత్కరిస్తున్న అసోసియేషన్

నవ్వుతోనే మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి-తెనాలి

నవ్వుతోనే మానసిక ప్రశాంతత దొరుకుతుందని సాహితీ వేత్త పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి అన్నారు. ఆదివారం పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం స్థానిక నందులపేట కవిరాజాపార్కు విజికె భవన్‌లో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షులు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'మానవజీవితంలో హాస్యం' అంశంపై సాహితీవేత్త పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి ప్రసంగించారు. ప్రపంచంలో నవ్వుకునే భాగ్యం మనిషికే సొంతమని, నవరసాల్లో హాస్యం కూడా ఒకటన్నారు. నవ్వుతో మానసిక ప్రశాంతత లభ్యమౌతుందన్నారు. ఈ సందర్భంగా ఆయనను అసోసియేషన్ బృందం సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు, కోశాధికారి సోమరౌతు నాగేశ్వరయ్య, హనుమారెడ్డి, చలమయ్య, సీతారామయ్య, రామకృష్ణ డాక్టర్ అబ్బయ్య, పాల్గొన్నారు.

కోటేశ్వరరావు మృతిపై సిఐడి విచారణ చేయండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దాచేపల్లిలో రజక సంఘం నాయకులు గరికపాటి కోటేశ్వరరావును అత్యంత దారుణంగా హత్య చేసి 14 ముక్కలుగా తగలబెట్టిన నిందితుడ్ని ఉరితీయాలని రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షించాల్సిన అధికారులు ఈ ఘటనపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ ఘటనపై సిబిసిఐడి దర్యాప్తు చేయించలన్నారు. తాము ఘటన స్థలాన్ని సందర్శించి స్థానికులను విచారించామని కోటేశ్వరరావు వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తి అని స్థానికులు చెప్పారన్నారు. శ్రీనివాసరావు వెంట సంఘం నాయకులు అక్కినపల్లి బాలయ్య, గుర్రపు శాల రామకష్ణ, కె రాము, వట్టికూటి సాంబయ్య,వేంపాటి విజయలక్ష్మి తదితరులు ఘటన స్థలాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు.

ఆకర్షణ ఉన్న చోటే సంఘర్షణ


కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ మంచా విజయమోహనరావు, డాక్టర్ రావి

- 'సంఘర్షణ' కవితా సంపుటి ఆవిష్కరణలో డాక్టర్ రావి రంగారావు

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రశ్నించడం మానుకుంటే ప్రగతిశీలత వెనుక బడుతుందని, ఆకర్షణ వున్నచోటే సంఘర్షణ వుంటుందనే విషయాన్ని కవి మధు తన 'సంఘర్షణ'లో స్పష్టం చేశారని అమరావతి సాహితీ మిత్రుల సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు అన్నారు. ఆదివారం కవి గోలి మధు రచించిన 'సంఘర్షణ' కవితా సంపుటిని స్థానిక మార్కండేయ కళ్యాణ మండపంలో సి.కె.జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ మంచా విజయమోహనరావు ఆవిష్కరించగా డాక్టర్ రావి సమీక్షించారు. కవితా సంపుటిని సామాజిక కార్యకర్తలు రేకా చంద్రశేఖర్, చాపరాల ఇందిరకు కవి అంకితమిచ్చారు. కార్యక్రమానికి మంగళగిరి సాహితి కళావేదిక కన్వీనర్ జి.ధనుంజయరావు అధ్యక్షత వహించగా నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) అధ్యక్షులు తేళ్ల అరుణ, ఆర్.కృష్ణార్జునరావు, ఆంధ్రనాటక కళాసమితి అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నైరుప్య చిత్రకారుడు అలెక్స్‌ను ప్రముఖ సాహిత్య విమర్శకుడు ఎ.రజాహుస్సేన్ సత్కరించారు.

నిద్ర రాకుంటే ఓ పుస్తకం చదువు

- కవిమిత్రుల కలయిక-కవి సమ్మేళనం-పుస్తక సమీక్షలో బాపట్ల జిల్లా డిఎస్‌పి గోలి లక్ష్మయ్య

ప్రజాశక్తి - గుంటూరు

నిద్ర రహిత జీవితం గడిపే వాళ్ల నిద్ర రాకుంటే ఓ పుస్తకం చదివి పడుకుంటే ప్రశాంతమైన నిద్రను ఆస్వాధించవచ్చని బాపట్ల జిల్లా డిఎస్‌పి గోలి లక్ష్మయ్య అన్నారు. ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం-పట్టాభి కళాపీఠం ఆధ్వర్యంలో 'కవిమిత్రుల కలయిక-కవి సమ్మేళనం-పుస్తక సమీక్ష'ను బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఒ హాలులో నిర్వహించారు. కార్యక్రమానికి నవ్యాంధ్ర రచయితల సంఘం జిల్లా అధికార ప్రతినిధి బి.జమదగ్ని అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన గోలి లక్ష్మయ్య మాట్లాడుతూ అక్షరమే మనిషి జన్మకు పరమావధి అని, అక్షరాన్ని ప్రేమించే వాడు ప్రపంచాన్నీ ప్రేమిస్తాడని అన్నారు. ప్రత్యేక అతిధిగా హాజరైన అరసం పల్నాడు జిల్లా కన్వీనర్ కోసూరి రవికుమార్ మాట్లాడుతూ పల్లెవీధుల్లో కవి సమ్మేళనాలు పెట్టి సాహిత్యాన్ని గ్రామవీధుల్లో పరిమళింపజేయాలన్నారు. పిల్లల మనసుల్లోకి సాహిత్యాన్ని తీసుకెళ్లకుంటే రేపటితరం మోడుగా మిగులుతుందని చెప్పారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ మంచి పుస్తకాలు మనిషి ఎదుగుదలకు తప్పక దోహదం చేస్తాయన్నారు. డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు రచించిన జాతీయ కవిచక్రవర్తి దామరాజు పుండరీకాక్షుడు పుస్తకాన్ని డాక్టర్ పి.వి.సుబ్బారావు సమీక్షించారు. అనంతరం కాకరపర్తి సుబ్రహ్మణ్యం కవి సమ్మేళనం నిర్వహించారు. సునీత దుర్గం చదివిన కవిత ఉత్తమ కవితగా ఎంపికవగా ఆమెను డాక్టర్ సేవాకుమార్ సత్కరించి బహుమతి అందించారు.


మాట్లాడుతున్న బాపట్ల జిల్లా డిఎస్‌పి గోలి లక్ష్మయ్య,యేమినేని వెంకటరమణ


సిద్ధమైన సభా ప్రాంగణం

సిఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

వాహనాల రాకపోకలకు దారి మళ్లింపు

ప్రజాశక్తి -తెనాలి

ఈనెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తెనాలి వస్తున్న సందర్భంగా ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉన్నట్లు డీఎస్పీ కె. స్రవంతి రాయ్ ఆదివారం తెలిపారు. తెనాలి నుంచి నారాకోడూరు మీదుగా గుంటూరు వెళ్లాల్సిన వాహనాలను కఠెవరం, నందివెలుగు,కొలకలూరు మీదుగా మళ్ళించారు. అలాగే నారాకోడూరు వైపు నుంచి తెనాలి రావాల్సిన వాహనాలను వడ్లమూడి, సంఘం జాగర్లమూడి, అంగలకుదురు, కోపల్లె ,గుడివాడ, కొలకలూరు, నందివెలుగు మీదుగా తెనాలికి మళ్ళించారు. వేమూరు అమర్తులూర్ వైపు నుంచి గుంటూరు వెళ్లాల్సిన వాహనాలను జగ్గడిగుంటపాలెం, చిన్న పరిమి, ద్వారకా నగర్ రెండు గేట్లు, పినపాడు, దుండిపాలెం, చౌవావారిపాలెం, అంగలకుదురు జాగర్లమూడి, వడ్లమూడి మీదుగా మళ్లించారు. భారీ మధ్య తరహా వాహనాలకు కూడా దారిమళ్ళింపు వర్తిస్తుందన్నారు. ప్రజలు గమనించి సహకరించాల్సిందిగా డిఎస్పీ కోరారు.

సిఎం సభావేదికను పరిశీలించిన ఎమ్మెల్యే శివకుమార్

రైతు భరోసా పంపిణీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి వస్తున్న నేపధ్యంలో సభ ఏర్పాట్లనూ, సుల్తానాబాద్ కవరాజా లే ఔట్‌లో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానశీం, నాయకులు కె.హరీస్, గౌరీశంకర్, కె.వెంకటేశ్వరరావు, దుబాయ్‌బాబు, బూరెల దుర్గా తదితరులున్నారు.


మహిళకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి

గర్భాశయ ముఖద్వారా కేన్సర్‌కు వ్యాక్సిన్‌తో చెక్

ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గర్భాశయ వ్యాధుల పట్ల మహిళలు ఎట్టి పరిస్థితుల్లోనూ అశ్రద్ధ వహించడం తగదని సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ గైనకాలజిస్ట్ డాక్టర్ బూసిరెడ్డి దీప్తి రెడ్డి సూచించారు. వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. ఆదివారం గుంటూరు రూరల్ వెంగళాయపాలెంలో ఉన్నతి ఫౌండేషన్, సాయి భాస్కర్ మల్టీస్పెషల్టి సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి హాజరైన మహిళలు, యువతలకు ఉచితంగా మందులు అందజేశారు.డాక్టర్ దీప్తి రెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా మహిళలు గర్భాశయ ముఖద్వారా క్యాన్సరు కు గురవుతున్నారని వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా నివారించవచ్చని పేర్కొన్నారు. ఆడపిల్లలకు తొమ్మిదవ సంవత్సరం వయసు వచ్చినప్పటి నుంచి 26వ సంవత్సరం వరకు వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా మంచి ఫలితాలు రాబట్టువచ్చని అన్నారు. వెంగళాయపాలెం సర్పంచ్ నల్లపాటి లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం 'చలో ఢిల్లీ'

ప్రజాశక్తి-రొంపిచర్ల

చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం కోసం స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కార్మిక, కర్షక ఐక్య సదస్సు సిఐటియు మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రెండవసారి అధికారానికి వచ్చిన తరువాత రైతులు , కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు పన్నులు తగ్గించి కార్పొరేట్లకు ప్రజల సొమ్మును కట్టబెట్టట మేనని విమర్శించారు.ప్రధాన రంగాలైన వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గించడం గురించి ప్రస్తావించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు చొప్పున ఇస్తానన్న వాగ్దానం ఊసే లేదని, పేదలపై జీఎస్టీ రూపంలో భారాలు వేసి, ఆహార సబ్సిడీలపై కోతలు పెట్టిందని విమర్శించారు. రాష్ట్రానికి విభజన హామీల ప్రస్తావనే లేకుండా కేంద్ర బడ్జెట్ ఉందని, ప్రత్యేక హెూదా, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ గురించి ప్రస్తావనే లేదని, పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో ఆర్ఆర్ ప్యాకేజీకి ప్రతిపాదించింది ఏమీ లేదని, వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ప్రస్తావనే లేదని విమర్శించారు. విఆర్ఎ, ఆశ, అంగన్‌వాడి రంగంలో పనిచేసే వారికి కనీస వేతనాలు అమలు జరగటంలేదని, ప్రభుత్వం మారినప్పుడల్లా వేధింపులకు గురవుతున్నారని, హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఆంజనేయులు నాయక్

అధికార వైసిపి, కాంగ్రెస్, టిడిపి, జనసేన పార్టీలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి లొంగిపోయాయని, రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి దాసోహమంటున్నాయని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సంబంధించిన రంగాలన్నింటికీ నిధులు పెంచాలని, వీటన్నింటిని సాధించుకోవడం కోసం, హక్కులను కాపాడుకోవడం కోసం ఐక్యంగా ఏప్రిల్ 5 చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కౌలు రైతుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు బండారుపల్లి నాగేశ్వరరావు, సరికొండ వెంకటేశ్వంరాజు మాట్లాడుతూ పార్లమెంటులో మద్దతు ధరలకు గ్యారంటీ చట్టం , రైతులకు రుణ విముక్తి చట్టం చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ.60 వేల కోట్లలో 30 శాతం కోతబెట్టారని, ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్య దర్శి బత్తుల బాలకోటయ్య, సాంబ శివరావు, కౌలు రైతుల సంఘం మండల కార్యదర్శి పోట్లూరు అంజిరెడ్డి పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్థానిక హరిత రిసార్ట్ లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి జలగం అంజయ్య (35) కుటుంబానికి ఎపి టూరిజం ఉద్యోగులు ఆదివారం రూ.30 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఎపి టూరిజం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పులుసు వీరారెడ్డి, నాగు, టి.శ్రీను ఆధ్వర్యంలో సంస్థలోని ఉద్యోగుల నుంచి సేకరించిన ముప్పై వేల రూపాయలను పర్యాటక శాఖ విజయవాడ డివిజన్ మేనేజర్ సిహెచ్ శ్రీనివాసరావు చేతుల మీదుగా మృతుని భార్య అంజమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అంజయ్య కుటుంబానికి టూరిజం తరపున తాము అండగా ఉంటామని చెప్పారు. ఆ కుటుంబ పరిస్థితి గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హరిత రిసార్ట్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. పెద్దమక్కెనకు చెందిన బలిజేపల్లి నికితకి ఉన్నత విద్య నిమిత్తం రూ. 5,000 సహాయం అందించారు. హుస్సేన్ నగరానికి చెందిన బొందల అక్షయకు విద్య అవసరాల కోసం చేయూత నిచ్చారు. కార్యక్రమంలో లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి హరిబాబు, వడ్లమూడి అప్పారావు, గల్లా బాబు, గోపాల్ రావు, బాలయ్య, సురేష్, రఘు, భావన రాంబాబు, తాంద్ర పద్మ ,ఫౌండేషన్ సభ్యులు కృష్ణారావు, కిరణ్ కుంచనపల్లి, ప్రసాద్, సిద్దయ్య పాల్గొన్నారు.

ఘనంగా సాగరమాత పతాకావిష్కరణ

7వ తేదీ నుండి మహోత్సవాలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్



స్థానిక సాగరమాత ఆలయంలో ఆదివారం ఉదయం 7.30 గంటలకు మాచర్ల విచారణ గురువులు గురుశ్రీ కొమ్మారెడ్డి రఫేలు చేతుల మీదుగా సాగరమాత పతా కావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా ఆలయంలో నవదిన జపాలు, దివ్యబలిపూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా రఫేలు మాట్లాడుతూ వచ్చే నెల 7వ తేదీ నుంచి 9 వరకు సాగరమాత మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26 నుంచి మొదలైన నవదిన జపాలు వచ్చే నెల 6వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 5.30 గంటల నుంచి జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో సాగరమాత ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాల సాగర్, ఫాదర్ అన్నెం జోసఫ్ తంబి, ఫాదర్ జోసఫ్, డీకాన్ అనిల్ కుమార్, ఆలయ పెద్దలు డి.ఇన్నారెడ్డి, జె.చిన్నపరెడ్డి, శౌరిరాజు, ఎ.మరియదాసు, శౌరిబాబు పాల్గొన్నారు.


మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొడాలి

ప్రతిపక్షాలన్నీ ఏకమైనా ఓడించలేరు

మంత్రి కొడాలి నాని

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ప్రతిపక్షాలన్నీ ఏకమైనా జగన్మోహన్‌రెడ్డిని ఓడించలేరని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, కొడాలి నాని హాజరయ్యారు. యార్డు చైర్మన్ పెండెం బాబురావుతో పాటు పాలకవర్గ సభ్యు లతో అంబటి రాంబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి పదవి కోసం ఎన్టీఆర్‌ను చంద్రబాబు చంపేశాడని ఆరో పించారు. బాబాయి వైఎస్ వివేకాను చంపింది జగన్మోహన్ రెడ్డేనని చంద్రబాబు చెప్పటం హాస్యాస్పదంగా వుందన్నారు. పవన్ కళ్యాణ్ ,చంద్రబాబు, లోకేష్ లు రోడ్డు మీదకు వచ్చి జగన్‌ను తిట్టటమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. అంబటి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్, చంద్రబాబులు తనను టార్గెట్ చేస్తున్నారని అన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఓటు చీలనివ్వను.. జగన్ మోహన్ రెడ్డిని గెలవనివ్వనని పవన్ కళ్యాణ్ ప్రగల్భాలు పలుకుతున్నా రని అన్నారు. ఎందరు ఏకమైనా జగన్‌ను, సత్తెన పల్లిలో తనను, గుడివాడలో కొడాలి నానిని ఓడించలేరని అన్నారు. ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే నంబూరి శంకరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-పెదకూరపాడు



అన్ని వర్గాలకు వైసిపి అండగా ఉం టుందని పెదకూరపాడు ఎమ్మెల్యే నం బూరు శంకరరావు అన్నారు. స్థానిక ఆనందపేటలో ఎస్సీ, ముస్లిం సామాజిక వర్గాలకు చెందిన 25 కుటుంబాలు ఎమ్మెల్యే సమ క్షంలో వైసిపిలో చేరారు. ఆయన మాట్లాడుతూ కులం, మతం, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నందువల్లే ప్రజలు తమ పార్టీలో చేరుతున్నారన్నారు. ఎవరికి ఏ అవసరమొచ్చినా తాను అండగా ఉంటానని చెప్పారు.

చిత్రకారుడు ప్రసాద్‌కు 'ఇండియన్ ఐకాన్'అవార్డు

ప్రజాశక్తి-వినుకొండ



పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు బి. ప్రసాదరావుకు 'ఇండియన్ ఐకాన్' అవార్డు దక్కింది. విస్టం చారిటబుల్ ట్రస్ట్ వారు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతికి ఆహ్వానించి తనకు ఈ అవార్డును అందజేసి ఘనంగా సత్క రించినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ప్రసాదరావును వినుకొండ ప్రముఖులు, కళాకారులు అభినందించారు. నలభై ఏళ్లుగా ఈ రంగంలో ఆయన ఎన్నో విభిన్నమైన చిత్రకళాఖండాలను సృష్టించారు. గిన్నిస్ వరల్డ్, కళా సామ్రాట్, సిసికెఎన్ అవార్డులను కూడా ఆయన సాధించారు.

2న మహాధర్నా జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నరసరావుపేట

సిపిఐ ఆధ్వర్యంలో విజయవాడలో వచ్చే నెల 2 న జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట సిపిఐ కార్యాలయంలో జరిగిన సిపిఐ నియోజకవర్గ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు జగనన్న కాలనీలో ఒక సెంటు స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తానని ఎన్నికలప్పుడు వాగ్దానం ఇచ్చి ఇంత వరకు ఆ హామీని నిలబెట్టుకోలేదన్నారు. జగనన్న కాలనీల్లో 10 శాతం గృహాలు కూడా పూర్తి కాలేదన్నారు. ఆ కాలనీలకు సంబంధించిన స్థలాల్లో పిచ్చి చెట్లు, తుమ్మ కంప పెరిగి వాటిని పట్టించుకునే నాథుడే లేడని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీ గృహాల లబ్ధిదారులకు ఒక్కొక్క ఇంటికి రూ 5 లక్షలు ఇవ్వాలని ఇసుక సిమెంటు ఉచి తంగా ఇవ్వాలని, టిడ్కో గృహాలను మౌలిక సదుపాయాలు కల్పించి వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఎఐటియుసి నాయకులు యు.రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ముక్కెళ్లపాడులో మొక్క జొన్న రైతు ప్రదర్శన క్షేత్రం

ప్రజాశక్తి-నూజెండ్ల



మండలంలోని ముక్కెళ్ళపాడులో మొక్క జొన్న రైతు ప్రదర్శన క్షేత్రం కార్యక్రమం నిర్వహించారు. అడ్వంటా కంపెనీ పిఎసి 741 రకం గతం కంటే ఎక్కువ దిగుబడి వచ్చిన సందర్భంగా కంపెనీ ప్రతినిధులు రోహిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగినఆదివారం ఓ కార్యక్రమం నిర్వహించారు. వినుకొండ డిస్ట్రిబ్యూటర్ విజయ లక్ష్మి సీడ్స్ అధినేత ఎన్.బ్రహ్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కంపెనీ ప్రతినిధి రోహిత్ కుమార్ మాట్లాడుతూ 741 రకం మిగతా అన్నిరకాల కంటే ఎక్కువ దిగుబడి నివ్వడం తో పాటు గింజ రంగు బాగా ఉండటం వలన మార్కెట్‌లో అధిక రేటు పలుకుతోందని చెప్పారు ఈ సందర్భంగా లాటరీ పద్ధతిలో రైతులకు బహుమతులు అందజేశారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇలాంటి అవగాహన కార్యక్రమం కంపెనీ వారు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సమీప గ్రామాల రైతులు హాజరయ్యారు.



కలవర్టు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న స్థానికులు

రోడ్డు వేశారు.. కల్వర్టు మరిచారు..

ప్రజాశక్తి -మంగళగిరి

రత్నాల చెరువులోని 12వ సచివాలయం ఉత్తర దిక్కున పాత రోడ్డు పై ఇటీవల సిసి రోడ్డును నిర్మించారు. ఆ రోడ్డుపై కల్వర్టు నిర్మించి పూర్తి చేయాల్సిన అధికారులు ఆ దిశగా పనులు చేపట్టలేదు. దీని వల్ల రాకపోకలు స్తంభించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని అధికారులను వేడుకుంటున్నారు.

రసవత్తరంగా మహిళా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-తాడేపలి

మహిళా వాలీబాల్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మంగళగిరి బైపాస్ భోగి ఎస్టేట్స్ నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో తెలుగు యువత ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో ఆదివారం సాయంత్రం సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. అనంతరం బహుమతి ప్రదానోత్సవ సభలో టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు, మహాసేన రాజేష్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎపిడబ్ల్యూజెఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులుగా బుల్లియ్య

ప్రజాశక్తి-తెనాలి



బాపట్ల జిల్లా అధ్యక్షుడు పి.బుల్లయ్య

ఏపి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ తెనాలి డివిజన్ సమావేశం ఆదివారం స్థానిక రామలింగేశ్వరపేటలోని ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక కార్యాలయంలో నిర్వహించారు. ఫెడరేషన్ డివిజన్ అధ్యక్షులు మంచికలపూడి రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకులు కనపర్తి రత్నాకర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం ఫెడరేషన్ అహర్నిశలూ శ్రమిస్తుందన్నారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ప్రమాద భీమా సౌకర్యం, నివేశన స్థలాల వంటి అంశాలపై పోరాడుతోందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో ఫెడరేషన్ బాపట్ల జిల్లా అధ్యక్షునిగా వేమూరు సాక్షి విలేకరి పి.బుల్లియ్యను ఎన్నుకున్నారు. సమావేశంలో ఫెడరేషన్ సీనియర్ నాయకులు టి.రవీంద్రబాబు, జి.ప్రభాకరరావు, బి.సురేష్‌బాబు, ఎస్ఎస్ జహీర్, మేకల సుబ్బారావు, కె.సాంబశివరావు, సభ్యులు జి.ప్రకాశరావు, సీహెచ్ రవికిరణ్, వి.డి.భూషణం, ఎం.ప్రసాద్, వి.లక్ష్మణరావు, ఎన్‌జె శామ్యూల్, డి.వెంకటేశ్వరరావు, ప్రేమ్‌కుమార్, బి.చందు, శేఖర్ పాల్గొన్నారు.

చిట్టడవిని తలపిస్తున్న ఒకనాటి సబ్‌జైలు

- ఆవరణలో దట్టంగా పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు
- పట్టించుకోని అధికారులు



పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిన సబ్ జైలు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్నంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెంబడి ఉన్న సబ్ జైల్ గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. సబ్ జైలు ఆవరణలో కంప చెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. గతంలో దీన్ని వినియోగించినా ఆనాటి అధికారుల నిర్లక్ష్యానికి భద్రతా లోపాలు, తదితర కారణాలవల్ల సబ్ జైలును రద్దు చేసి ఉన్న ఖైదీలను జిల్లా కోర్టుకు తరలించారు. అప్పటి నుంచి ఈ భవనాన్ని ఏ ఇతర అవసరాలకూ ఉపయోగించడం లేదు. దీంతో కోట్లాది రూపాయల విలువైన ఆ ప్రాంగణం ఎందుకు పనికి రాకుండా నిరుపయోగంగా మారింది. ఇటీవల నగరానికి నూతనంగా జిల్లా కోర్టు మంజూరై త్వరలోనే అందుబాటులోకి రానున్న నేపథ్యంలో సబ్ జైలు కూడా ఉండటం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ముద్దాయిలను సమయానికి కస్టడీకి తీసుకోవడంలోనూ, బెయిల్ మంజూరు చేసిన తర్వాత సమయానికి రిలీజ్ చేయడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని పలువురు న్యాయవాదులు చెబుతున్నారు.

గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

యువతను జాగృతులను చేసి వారిలో సేవాదృక్పధాన్ని పెంపొదించడంలో గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అద్వితీయమని నగర డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు తెలిపారు. ఆదివారం గుంటూరులోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ 4వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. తెలుగు రాష్ట్రాల నుండి 100 మంది ప్రతినిధులు హాజరైయ్యారు. బాలవజ్ర బాబు ప్రసంగిస్తూ గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ డైరెక్టర్ విట్సన్ పాల్ చదువుకుంటూ సామాజిక సేవలో భాగస్వామ్యులయ్యారన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ గత 4సంవత్సరాలుగా గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ ద్వారా 1000 మంది రక్తదానం చేశారని అన్నారు. గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ డైరెక్టర్ విట్సన్ పాల్,బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ సెక్రటరీ భగత్ సింగ్,దారా సుధాకర్,దాసరి జెన్ని బాబు,కేశవ శివ నాగన్న,తెలుగు రాష్ట్రాల నుండి వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న డి. రాజ్‌కుమార్

కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని పేరేచర్లలో సీప్ ఇండియా ఆఫీస్‌లో ఆదివారం 20 మంది మహిళలకు కుట్టు మెషిన్ల పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పేరేచెర్ల గ్రామ సర్పంచ్ దేవరకొండ రాజ్ కుమార్ పాల్గొని కుట్టు మెషీన్లు,సర్టిఫికెట్లు అందజేశారు. సీప్ సంస్థ అధ్యక్షులు గొల్లపూడి ముక్కంటి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో ప్రమాణాలను మెరుగుపరుచుకోని స్థిరమైన ఆదాయ వనరులను ఏర్పరుచుకోవాలన్నారు. ఇది వారి ఆత్మగౌరవాన్ని , ఆర్థిక స్వాలంబనకు, నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు తొడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమములో ఇన్‌స్పెక్టర్ ఎ. రాధాకృష్ణ కుమారి పాల్గొన్నారు.



సంగీత కళాకారుడు మాణిక్యరావును సత్కరిస్తున్న బృందం

సంగీత కళాకారుడు మాణిక్యరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక కొత్తపేట పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏడాదిపాటు ప్రదర్శించిన ఎన్టీఆర్ చిత్రాలపై సమీక్ష జరిగింది. ముఖ్యవక్తలుగా పాల్గొన్న వీరమాచనేని వెంకటేశ్వరరావు, పులిపాక శ్రీకర్ మాట్లాడుతూ దాన వీర సూర కర్ణ, యమగోల, గజదొంగ, రక్తసంబంధం, మిస్సమ్మ, గుండమ్మకథ, జస్టిస్ చౌదరి వంటి ఎన్నో చిత్రాలు దీర్ఘకాలం ప్రదర్శింపబడ్డాయని తెలిపారు. అనంతరం పట్టణానికి చెందిన సంగీత కళాకారుడు ముక్కాల మాణిక్యరావును సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, వెలగా సుభాష్ చంద్రబోస్, సూర్యదేవర సత్యనారాయణ డి.నీలాంబరం, బి.మోహనరావు, కె.ఏడుకొండలు పాల్గొన్నారు

లాభాపేక్ష లేని సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బృందావన గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో అవగాహన సంస్థ అధ్యక్షులు కొండశివరామిరెడ్డి ఆధ్వర్యంలో సంస్థ 32వ వ్యవస్థాపక దినోత్సవ సభ ఆదివారం నిర్వహించారు. అనంతరం ఆరోగ్య సభ నిర్వహించారు. డిఎన్.దీక్షిత్ అధ్యక్షతన జరిగిన సభలో రాయపాటి శ్రీనివాస్, అవగాహన పూర్వ అధ్యక్షులు నూతలపాటి తిరుపతయ్య, వాస్తు సిద్ధాంతి తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, కళాభూషణ వేదయ్య, ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షులు లంక విజయబాబు పాల్గొన్నారు. ప్రధాన వక్తగా ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. సభాధ్యక్షులు దీక్షిత్ మాట్లాడుతూ అవగాహన సంస్థ చేస్తున్న సామాజిక సేవలు మరువలేనివని అన్నారు. రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ శివరామిరెడ్డి లాభాపేక్ష లేని సేవలు అభినందనీయమన్నారు. కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ 1992 ఫిబ్రవరిలో ప్రారంభించి 31 సంవత్సరాలుగా నిరాటంకంగా నిర్విరామంగా 4000కు పైగా సామాజిక, విద్యా, వైజ్ఞానిక, ఆరోగ్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ 32వ సంవత్సరంలో ప్రవేశించినట్లు చెప్పారు. అవగాహన 1992లో జ్యోతి వెలిగించి, ప్రారంభించిన రాయపాటి శ్రీనివాస్, డీ.ఎన్. దీక్షిత్ ప్రస్తుత 32 వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొనటం విశేషమన్నారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి, రాయపాటి శ్రీనివాసుల్ని ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన 225వ ఆదివారం ఆరోగ్య సభలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో గుండె జబ్బులు యువతలో రావటం చాలా బాధాకరం అన్నారు. ఉమ్మడి కుటుంబాలు లేకపోవటం, ఎక్కువగా సెల్‌ఫోన్ వాడటం, గంటల తరబడి టివి చూడటం, ఒత్తిడి వల్ల యువతలో గుండెజబ్బులు వస్తున్నాయన్నారు. మంచి ఆహార అలవాట్లు, వ్యాయామం, మెదడుకు పని కల్పించే క్విజ్ గేమ్స్, ఔట్‌డోర్ గేమ్ వంటి వాటి వలన చాలా వరకు గుండె జబ్బులను అరికట్టవచ్చున్నారు. కార్యక్రమాన్ని పి.ఎస్.మూర్తి పర్యవేక్షించారు.



రాయపాటి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అవగాహన సభ్యులు



యశ్వంత్‌కు నగదు, షీల్డును అందిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

ఐఐటి విద్యార్థికి రూ.లక్ష సాయం

ప్రజాశక్తి-తెనాలి

ఐఐటికి ఎంపికైన విద్యార్థికి మాజీ ఎమ్మెల్యే దంపతులు రూ.1 లక్ష ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ నివాసంలో ఆదివారం డాక్టర్ హరిప్రసాదరావు గోగినేని స్మారకంగా ఆయన కుమారుడు గోగినేని లక్ష్మిప్రసాద్, డాక్టర్ ఉమ దంపతులు, మనుమడు సందీప్‌బాబులు నిర్వహించిన కార్యక్రమంలో నగదును అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా గుడివాడ మండలం గురజ గ్రామానికి చెందిన జాస్తి యశ్వంత్ ఐఐటి(సిఎస్ఈ) మొదటి సంవత్సరం చదువుతున్నాడు. యశ్వంత్ అవసరాన్ని గుర్తించిన ఉమ దంపతులు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్. వెంకటరమణ, జి.బుల్లిప్రసాద్, టి.శ్రీనివాసరావు, గుమ్మడి రమేష్, ఎన్. బెన్ను, చెరుకూరి సుబ్బారావు, కె. శ్రీనివాసరావు, ఎం. యుగంధర్, హరిబాబులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కౌన్సెలింగ్ఇస్తున్న సిఐలు శేషగిరిరావు, సాంబశివరావు

విద్యార్థులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటి ఎంసి పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యు ప్రాంతాలలో అనుమానాస్పద నివాసాలలో ఉంటున్న వారిని, హాస్టల్ విద్యార్థుల హాస్టల్స్‌లోనూ ఆదివారం తాడేపల్లి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తాడేపల్లి పోలీస్ స్టేషన్ సిఐలు శేషగిరిరావు, సాంబశివరావుల ఆధ్వర్యంలో ఆరు బృందాలుగా ఏర్పడి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులు చెడు అలవాటులకు బానిసలు కాకుండా, వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచిగా చదువుకొని కెరీర్ పై దృష్టి పెట్టాలని సీఐలు శేషగిరిరావు, సాంబశివరావు విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ తనిఖీలలో తాడేపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐలు రమేష్ బాబు, నారాయణ , పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధిక కొవ్వుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని మెల్లెంపూడి గ్రామంలో ఆదివారం దళిత నాయకుడు తుమ్మపూడి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అధిక కొవ్వు పై అనర్థాలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉచిత అవగాహన కార్యక్రమాన్ని న్యూట్రిషన్ వెల్నెస్ కోచ్‌లు నిర్వహించారు. బరువు అదుపులో ఉంచుకోవడం, బరువు తగ్గించుకోవడం, శరీరానికి కావాల్సిన న్యూట్రిషన్ ఏవిధంగా తీసుకోవాలో పలు అంశాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ఈ అవగాహన కార్యక్రమంలో తుమ్మపూడి విజయ్ కుమార్, తుమ్మపూడి సునీల్, సిపిఎం నాయకులు కంచర్ల జేమ్సులు పాల్గొన్నారు.



కృష్ణానదిలో ఈత పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాదీ 23వ కృష్ణా రివర్ క్రాసింగ్ జాతీయ స్థాయి ఈతల పోటీలను ఆదివారం నిర్వహించారు. తాడేపల్లి లోటస్ ఫుట్ సిటీ నుంచి నది అవతల ఉన్న విజయవాడ దుర్గాఘాట్ వరకు జరిగిన ఈ పోటీలను విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి 415 మంది ఈతగాళ్లు పాల్గొన్నారు. 11 నుంచి 60 ఏళ్లు పైబడిన వారు ఈ పోటీల్లో పాల్గొనగా ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో మైహోం అధినేత రామేశ్వరరావు మనవడు భవస్వరూపరావు విజేతగా నిలిచాడు. 31-45 ఏళ్ల విభాగంలో ఎన్‌టిఆర్ జిల్లా స్విమ్మర్ (హెడ్ కానిస్టేబుల్) మోతుకూరి తులసి చైతన్య విజేతగా నిలిచారు. అనంతరం నిర్వహించిన సభలో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ చైర్మన్ గోకరాజు గంగరాజు అందజేశారు. కాంతిరాణా మాట్లాడుతూ పోటీల్లో మహిళలూ పాల్గొనడం అభినందనీయమన్నారు. శరీరానికి ఈత మంచి వ్యాయామన్నారు. ప్రతి సంవత్సరం కృష్ణా రివర్ క్రాసింగ్ ఈతల పోటీలను నిర్వహిస్తున్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎఆర్ ఎడిసిపి కె.శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ ఎసిపి ఎన్.వి.రమణమూర్తి, విజయవాడ పశ్చిమ డివిజన్ ఎసిపి కె.హనుమంతరావు పాల్గొన్నారు.

చలోఢిల్లీ జయప్రదానికి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ఏప్రిల్ 5న చలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఈనెల నుండి ఇంటింటి ప్రచారం చేపట్టనున్నట్లు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ తెలిపారు. జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన యూనియన్ జిల్లా కౌన్సిల్ సమావేశం పాతగుంటూరులోని కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్లకు, బడాపెట్టుబడిదారులకు దోచిపెడుతోందని, ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. దేశ ప్రజలు శ్రమతో నిర్మితమైన ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేటీకరిస్తుందని, ఎల్ఐసి, బ్యాంకులు, రైల్వేలు, పోర్టులు, ఆఖరికి పిల్లలు ఆడుకునే ఆటస్థలాలనూ ప్రైవేటీకరిస్తుందని మండిపడ్డారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తూ 4 లేబర్ కోడ్లను తెచ్చి, కార్మికుల రక్త మాంసాలను హరిస్తోందన్నారు. ఉద్యోగులకు భద్రత లేకుండా చేస్తుందన్నారు. దేశానికి వెన్నెముకగా ఉన్న వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్లకు కట్టబెట్టి, రైతులను భిక్షగాళ్లుగా మారుస్తోందని చెప్పారు. నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు కాలేదన్నారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి, పేదల వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రజావ్యతిరేక, మతోన్మాద, బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పకపోతే దేశ సంపదంతా అదాని, అంబానీల చేతుల్లోకి వెళు తుందని హెచ్చరించారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా 2023 ఏప్రిల్ 5న లక్షలాదిమందితో దేశ రాజధాని ఢిల్లీలో మహాసంఘర్షణ (కార్మిక, కర్షకుల) ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దీనిపై గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ విధానాలు వివరించి, ప్రజల్ని చైతన్యం చేయాలన్నారు. సభలు, సమావేశాలు, ప్రచార ర్యాలీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, వి.దుర్గారావు, హుస్సేన్ వలి, కార్యదర్శులు బి.లక్ష్మణరావు, ఎన్.శివాజీ, బి.ముత్యాలరావు, ఎం.భాగ్యరాజు, ఎన్.రమేష్‌బాబు, నాయకులు రాధా, ఆది నిక్సలన్, ఎస్ఎం.వలి, షేక్ బాషా, ఎం.రవి, వై.కమలాకర్, జి.రామ్మోహన్‌రావు, శంకర్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి సురేష్ తదితరులు

మందడంలో జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - తుళ్లూరు : క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని బాపట్ల ఎంపి నందిగం సురేష్ అన్నారు. 41వ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలు మండలంలోని మందడం గోల్డెన్ రూల్ స్కూల్‌లో 3,4,5 తేదీల్లో నిర్వహించనున్న దృష్ట్యా పోస్టర్‌ను ఎంపీ ఉద్దండ్రాయునిపాలెంలో ఆదివారం ఆవిష్కరించారు. పోటీల నిర్వహణకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెజె జోసఫ్ (సౌత్ ఇండియా కన్వీనర్), వైసిపి నాయకులు కె.ప్రభుదాస్, గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం.కిషోర్‌బాబు, టోర్నమెంట్ ఆర్గనైజర్ ఎల్.దుర్గాప్రసాద్, పి.సురేంద్ర, బి.నవీన్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి, స్టేట్ అఫిషియల్స్ నరేష్, రాకేష్, బి.ప్రవీణ్, సురేష్, వెంకటముత్యం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సికె విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 18వ రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మంగళగిరిలోని సీకే జూనియర్ కళాశాల విద్యార్థి ఎం.మధుబాబు ప్రతిభను చాటారు. అండర్-18 విభాగం 110 మీటర్ల హర్‌డిల్స్‌లో తృతీయ స్థానం, 400 మీటర్ల హర్‌డిల్స్‌లో తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాడు. గతేడాది ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో, ఏలూరులో జరిగిన సౌత్ జోన్ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ మధుబాబు ప్రథమ, తృతీయ స్థానాలను సాధించాడు. మధుబాబును సీకే జూనియర్ కళాశాల సెక్రటరీ జంజనం పాండురంగారావు, అధ్యాపకులు, విజేత స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ, ఐ.వెంకట్రావు, ఖలీల్, సాంబశివరావు, బాజిఖాన్, రుద్ర రవికుమార్, అక్బర్, ఖాజా అభినందించారు.



లిటిల్ ఫ్లవర్ స్కూల్లో ఫుట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు: గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో లీగ్ మ్యాచ్‌లను స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ లీగ్ మ్యాచ్‌లో జిల్లా నుండి మొత్తం 8 టీములు పాల్గొన్నాయి. గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, సెక్రెటరీ దుర్గా మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో ఫుడ్‌బాల్ అభివృద్ధి కోసం ప్రతి ఆదివారం జిల్లాలోని వివిధ కేంద్రాల్లో సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్, బాలికల విభాగంలో లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

- పుస్తక పఠనం పెంచేందుకు కృషి
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- ఇంకా రూ.40 కోట్ల వరకు సెస్సు వసూలవ్వాలి
- ప్రజాశక్తితో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్

ఇంటర్వ్యూ

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, పుస్తక పఠనం పెంచేందుకు కృషి చేస్తున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ చెప్పారు. అన్ని గ్రంథాలయాలను దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని, జిల్లా గ్రంథాలయాన్ని విద్యార్థులకు స్టడీ సెంటర్‌గా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. స్థానిక సంస్థల నుంచి సెస్సు వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టామన్న ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.



గ్రంథాలయాలలో పెంచిన సౌకర్యాలు?

గతేడాది నేను బాధ్యతలు స్వీకరించిన వెంటనే రూ.1.50 కోట్లతో కొత్తపుస్తకాలను కొనుగోలు చేశాం. ఈ పుస్తకాలను పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రధానంగా గుంటూరు జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులు మరిన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. ఎస్సి, ఎస్‌టి. బ్యాగ్‌ల్యాగ్ పోస్టులను భర్తీ చేశాం. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో దాదాపు 14 మందిని నియమించారు. కారుణ్య నియామకాల ద్వారా ఐదుగురుకి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ తన ఎమ్మెల్యే నిధుల నుంచి 20 కంప్యూటర్లను ఇచ్చేందుకు అంగీకరించారు. త్వరలో వీటిని జిల్లా గ్రంథాయాలనికి ఇస్తారు.

సెస్సు వసూలుకు తీసుకున్న చర్యలు?

జిల్లాలో భారీగా ఉన్న సెస్సు బకాయిలు వసూలు చర్యలు చేపట్టాం. గుంటూరు నగర పాలక సంస్థ నుంచిరూ.10 కోట్లు, మిగతా స్థానిక సంస్థల నుంచి రూ.5 కోట్లు వసూలు చేశాం. మరో రూ.40 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. వీటి వసూలుకు అధికారులతో సంప్రదిస్తున్నాం.

గ్రంథాలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు?

కొత్త గ్రంథాలయాల నిర్మాణానికి పలు గ్రామాల్లో ప్రతిపాదనలు చేశాం. కొన్నింటిని ఇప్పటికే చేపట్టాం. కొన్ని పనులు వివిధ దశల్లో ఉన్నాయి. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపిల సహకారంతో వారి నిధుల నుంచి మరికొన్ని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. గుంటూరు, గురజాల తదితర ప్రాంతాల్లో దాతల సహకారంతో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్ల గ్రంథాలయాన్ని అన్ని వసతులతో ఇటీవల ప్రారంభించాం. జిల్లా గ్రంథాలయంలో రూ.లక్షన్నరతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయించాం. జిల్లా గ్రంథాలయంలో ఆర్.సుబ్బారావు రూ.10 లక్షల ఆర్థిక సహకారంతో మౌలిక సదుపాయాలు కల్పించాం. గురజాలలో గుంటూరు మిర్చి యార్డుచైర్మన్ చంద్రగిరి ఏసురత్నం తల్లి భాగ్యమ్మ పేరున రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాం. ఖాజీపాలెం, దాచేపల్లిలో ప్రహరీలు నిర్మించాం. కొన్నిచోట్ల మరుగుదొడ్లు నిర్మించాం. బాపట్లలో రూ.కోటి, పూండ్లలో రూ.25 లక్షలు, అమృతలూరులో రూ.57 లక్షలు, కర్లపాలెంలో రూ.20 లక్షలు, మాచవరంలో రూ.25 లక్షల, నర్సరావుపేటలో రూ.20 లక్షలు, చిలకలూరిపేటలో రూ.25 లక్షలు, దుర్గిలో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాం.

డిజిటల్ లైబ్రరీల నిర్వహణ ఎలా ఉంది?

వీటిని ఎవరు నిర్వహించాలనేది ఇంకా నిర్ణయం కాలేదు. ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేస్తుంది. ఇంకా ప్రభుత్వం నిర్ధేశించలేదు.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి